క్లుప్తంగా

జోరందుకుంటున్న వరినాట్లు


కాగుపాడు టైలండు భూముల్లో దమ్ములు చేసిన దృశ్యం

ఉంగుటూరు: వర్షాలు కురవడంతో మండలంలోని ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. చాలా గ్రామాల్లో ముందస్తు వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో వరి నాట్లకు ఉపక్రమించారు. ఇప్పటికే నారుమడులు వేయడం పూర్తయింది. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాంతో టైలాండ్, డెల్టా ప్రాంత వ్యవసాయ కూలీలు అక్కడి వ్యవసాయ పనులతో బిజీగా ఉన్నారు. అయితే వర్షం దాటికి కొందరి రైతుల నారుమల్లు దెబ్బతిన్నాయి.

మట్టి నమూనా సేకరణ


పెదపాడులో మట్టి నమూనా సేకరిస్తున్న వానపల్లి ప్రదీప్‌కుమార్

పెదపాడు: మండలంలోని పెదపాడులో మట్టి నమూనా పరీక్షలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. బుధవారం పెదపాడులోని ఎం.పవన్ కుమార్ అనే రైతు పొలంలో నమూనాను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా మట్టి నమూనా సేకరిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని రైతు సేవా కేంద్రం అధికారులు ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో 700 మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని కలపర్రులో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలల్లో హాజరుశాతం పెంచాలని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని వారికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

బాల్యం నుంచే పరిశుభ్రతపై అవగాహన


చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని పలువురు వక్తలు తెలిపారు. బాల్యం నుంచే పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బుధవారం గణపవరంలోని చినరామచంద్రపురం అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు కడుక్కునే విధానాన్ని వివరించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నీట్ పరీక్షల్లో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి సవలం మోహన్ ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని విమర్శించారు. నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్ పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా ఉందని, బీజేపీ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం దురదృష్టకరమన్నారు. ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఉంగుటూరు మండలపరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే ధర్మరాజు


అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. బుధవారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధిలో ఉంగుటూరు నియోజవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తానని తెలిపారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు.

తెదేపా సర్పంచ్‌లు వాగ్వివాదం

మండల పరిషత్తు సమావేశంలో డిఈ ఉప్పలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నివేదిక వివరిస్తుండగా కాకర్లమూడి సర్పంచ్ నాగు, తల్లాపురం సర్పంచ్ నర్సింహరావులు ఒక్కసారిగా లేచి మాటలతో దాడి చేశారు. ఈ విషయంపై సర్ది చెప్పబోయిన ఎంపీపీ, జెడ్పీటీసీపైన వాగ్వివాదానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా నాగు మాట్లాడుతూ మా గ్రామ సచివాలయ భవనం నిర్మాణం సగంలో నిలిచిపోతే దానిమీద సర్పంచ్ హోదాలో పలుమార్లు తెలియజేసినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తల్లాపురం గ్రామంలో ఆపేసిన నిర్మాణాలపై అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ పసుపులేటి నర్సింహరావు ఆవేదన వ్యక్తం చేశారు. వి.ఎ. పురం, గొల్లగూడెం, కంసాలి గుంట సర్పంచులుకూడా మా గ్రామంలో అసంపూర్తి పనులపై డీఈని ప్రశ్నించారు. నారాయణపురం విద్యుత్ ఎఇ శ్రీరామ్ మాట్లాడుతూ 68 ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మాణంతో లోవోల్టేజి సమస్య పరిష్కరించామన్నారు. ఏవో బాలిన వెంకటేష్ మాట్లాడుతూ 4,675మంది రైతులకు 68కోట్లు ధాన్యం డబ్బులు రావాల్సిఉందని అన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కల్పించుకుని సంబంధిత మంత్రితో మాట్లాడానని ఈ వారంలో వెయ్యికోట్లు విడుదల చేస్తామని వివరించినట్లు ఎమ్మెల్యే ధర్మరాజు సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యు ఎస్ ఎఇ హరినాథ రాజు, పీహెచ్‌సీ డాక్టర్లు సుబ్బరాజు వర్మ, ఇరిగేషన్ ఏఈ పెద్దిరాజు, ఐసీడీపీవో విజయలక్ష్మి, ఆర్అండ్‌బి ఎఈ భాస్కరావు, ఉపాధి ఏపీవో మల్లేశ్వర రావు, హార్టికల్చర్ ఏవో దైవాదీనం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్‌టీఓ గణేష్‌కు సత్కారం


రిటైర్డ్ ఎస్‌టీఓ గణేష్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఖజానా శాఖలో వివిధ హోదాల్లో గత 30 ఏళ్లుగా పని చేసి ఉప ఖజానా అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన గడ్డం విజయ గణేష్ సేవలు ఉద్యోగులకు ఆదర్శనీయమని పలువురు అతిథులు అన్నారు. గత నెల 30వ తేదీన ఆయన ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా బుధవారం స్థానిక సారధి గ్రాండ్ ఫంక్షన్ హాలులో గణేష్ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు మాట్లాడుతూ ఖజానా శాఖలో అవినీతిపై ప్రజల్లో, ఇతర శాఖల ఉద్యోగుల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ గణేష్ అవినీతి రహితంగా సేవలందించారన్నారు. ఆయన వద్దకు ఏ శాఖ ఉద్యోగులు వచ్చినా, రిటైర్డ్ ఉద్యోగులు వచ్చినా ఎంతో మర్యాదగా వారి పనులను పూర్తి చేసి వారి సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ ఇతర ఉద్యోగులకు మార్గదర్శకమన్నారు. పదవీ విరమణ చేసినా గణేష్ పాలనా వ్యవహారాల్లో మాతృశాఖ ఉద్యోగులకు సహాయకారిగా ఉండాలని కోరారు. అనంతరం విజయ గణేష్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఖజానా అధికారి టీ కృష్ణ, మచిలీపట్నం జిల్లా ఖజానా అధికారి ఎస్.రవికుమార్, పశ్చిమ గోదావరి జిల్లా ఖజానా అధికారి ఏ. గణేష్, తూర్పు గోదావరి జిల్లా ఖజానా అధికారి ఎన్.సత్యనారాయణ, ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్. విద్యాసాగర్, ఏపీటీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు పీ శోభన్‌బాబు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యూవీ పాండురంగారావు, కప్పల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జాలిపూడి ఎస్సీ కాలనీ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ఎస్సీకాలనీలో చీకట్లు కమ్ముకున్నాయి. వారం రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రివేళ పిల్లలు, వృద్ధులు చీకట్లో భయం, భయంగా సంచరిస్తున్నారు. ఇంటి లైట్లు వెలుగుల ఆధారంగా రాకపోకలు సాగిస్తున్నారు. కాలనీ నివాసితుడు, గ్రామ ఎంపీటీసీ కాకర్ల తంబి 'సాక్షి'తో మాట్లాడుతూ వారంరోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని చెప్పినా కార్యదర్శి కుమార్ పట్టించుకోవడం లేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే గ్రామ టీడీపీ నాయకుడు బుజ్జబ్బాయి ఎస్సీకాలనీలో వీధిలైట్లు వెలకగపోయినా పట్టించుకోవద్దు అన్నాడన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఎస్సీకాలనీపై కక్ష సాధింపు కొనసాగుతోందన్నారు. గ్రామంలో ఇతర కులస్తులు జీవిస్తున్న ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా పనులు కొనసాగుతున్నా కాలనీల్లో జరగడం లేదన్నారు. నాయకులతో పాటు గ్రామ పంచాయతీ అధికారులు సైతం ఎస్సీలపై చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుదల, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నిరంకుశ వైఖరిని విడనాడాలి

ఏలూరు (టూటౌన్): మోడీ నిరంకుశ పాలనను ఎండగట్టేవిధంగా కాంగ్రెస్ నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఎక్కుపెట్టిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఆయా అంశాలను పక్కదోవ పట్టించేందుకు బీజేపీ శ్రేణులు బుధవారం కాంగ్రెస్ కార్యాలయం ముందు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో చట్ట సభలు ప్రజా సమస్యలపై, దేశ అభివృద్ధిపై చర్చించే ప్రదేశాలుగా ఉన్నాయని, అక్కడ అధికార పార్టీల పరిపాలనపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం సహజమన్నారు. దేశంలో లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానం తదితర అంశాలపై మాట్లాడే వారిని నిరంకుశంగా అణచివేయాలని బీజేపీ, మోడీ ప్రయత్నిస్తే దేశంలో ప్రజలు చూస్తూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు. అధికార మదంతో తమకి 400 సీట్లు వస్తే దేశంలో రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ వారికి దేశప్రజలు ఇచ్చిన తీర్పు గుణపాఠం చెప్పారని ఏ.రవి స్పష్టం చేశారు.

మిగులు భూములను పేదలకు పంచాలి


జెండా పాతి భూపోరాటాన్ని ప్రారంభించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి

టి.నరసాపురం: ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో మిగులు భూములు స్వాధీనం చేసుకునే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి భూమిలో పాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను పేదలకు పంచాలని గత 8 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. లంచాలు మింగి భూస్వాములకే ఈ భూములను కట్టబెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చట్ట విరుద్ధంగా, చట్టాన్ని ధిక్కరిస్తూ భూములను భూస్వాములకు ఏ విధంగా కట్టబెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి లాభాలు పొంది తర్వాత ప్రభుత్వ భూములు తమవే అనడం దుర్మార్గం అన్నారు. నాటి ప్రభుత్వం రిజర్వాయర్ కోసం సేకరించిన భూములకు అప్పటి రేటు కేటాయించి రైతులకు, భూస్వాములకు పూర్తిస్థాయి పరిహారం ఇచ్చిందని తెలిపారు. కానీ పరిహారం పొందిన వాళ్లే నేడు భూములను సాగు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే భూమిలేని దళితులు, గిరిజనులు ఇతర కులాల్లోని పేదలకు ఈ భూములు అప్పజెప్పాలని కోరారు. వారికీ ఎక్స్ ఎల్ పట్టాలు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. పోలవరం, చింతలపూడి ఎమ్మెల్యేలు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి రామకృష్ణ వ్యవసాయ కూలీల సమస్యలు, పేదలు ఇబ్బందులు పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తామా ముత్యాలమ్మ, మండపం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు యాగంటి సీత, అనుమోలు మురళి, గంగాభవాని, రామలక్ష్మి, చెల్లమ్మ, రాజు, సిద్ధు, మరో వంద మంది పేదలు దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఐటీడీఏను సందర్శించిన కలెక్టర్

బుట్టాయగూడెం: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. వెట్రి సెల్వి బుధవారం మొదటిసారిగా కేఆర్‌పురం ఐటీడీఏను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు స్వాగతం పలికారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను ఆమె పరిచయం చేసుకున్నారు. త్వరలోనే మళ్లీ ఐటీడీఏకు వస్తానని ఆ సమయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. ఏపీఓ పీవీఎస్ నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్, వెలుగు ఏపీడీ ఎన్.నాగేశ్వరరావు, ఐటీడీఏ డీవైఈఓ నీలయ్య, జీసీసీ అకౌంటెంట్ సీహెచ్ రాజయోగి పాల్గొన్నారు.

ఎస్టీమ్ పవర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

దెందులూరు: విద్యుత్ వినియోగదారులందరూ ఇకపై గూగుల్‌ప్లే స్టోర్‌నుండి ఎస్టీమ్ పవర్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యుత్ శాఖ దెందులూరు ఏడీఈ త్రివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొబైల్‌లో డిస్కం వెబ్‌సైట్ ద్వారా తమ విద్యుత్ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎస్టీమ్ పవర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపుపై గ్రామాల్లో ఏఈలు, లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు పూర్తిస్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఏడీఈ త్రివాస్ సూచించారు.

సదరం సర్టిఫికెట్ల స్లాట్‌ల విడుదల

దెందులూరు: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి స్లాట్లను ప్రభుత్వం విడుదల చేసిందని దెందులూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్టిఫికెట్ కోసం గురువారం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ సెంటర్లో బస్టాండ్లు ఉన్న ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని సర్పంచ్ బండారు సింధు బుధవారం ఆర్టీసీ అధికార్లుకు ఎమ్మెల్యే ధర్మరాజు ద్వారా తెలియజేశారు. దీంతో ఆర్టీసీ అధికార్లు ఈ విషయపంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్డు పాడైపోయిందని, రోడ్డు నిర్మింపజేయమని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ధర్మరాజు డిఈ శ్రీనివాసును సీసీ రహదారిరోడ్డు వెడల్పుగా నిర్మించే ప్రతిపాదన తయారు చేయాలని సూచించారు.

పింఛన్ సొమ్ము పంపిణీలో అవకతవకలపై ఆరోపణలు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.లక్ష మేర పింఛన్ సొమ్మును వీఆర్వో స్వాహా చేయడంతో, ఆ సొమ్మును ఆమె వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి వెంకటేశ్వరరావు తన బంగారాన్ని తాకట్టుపెట్టి మరీ లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం. పంగిడిగూడెం గ్రామంలో 56 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేసే బాధ్యతను అధికారులు ఆ గ్రామ వీఆర్వో చంద్రలీలకు అప్పగించారు. తొలిరోజు ఆమె 39 మందికి పింఛన్లను అందించారు. మరుసటి రోజు మధ్యాహ్న సమయానికి నలుగురికి పంపిణీ చేశారు. దీంతో మిగిలిన 17 మంది లబ్ధిదారులు తమకు పింఛన్ అందలేదని గగ్గోలు పెట్టడంతో ఆ సొమ్మును వీఆర్వో స్వాహా చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దాంతో ఆ రోజు మధ్యాహ్నం డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి పంగిడిగూడెం గ్రామానికి వెళ్లి వీఆర్వోతో, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అయితే కొద్దిసేపటికి మిగిలిన 13 మంది లబ్ధిదారులకు వీఆర్వో పింఛన్ సొమ్ము రూ.89 వేలను అందించారు. దాంతో పూర్తిస్థాయిలో పింఛన్ల పంపిణీ జరిగినట్టు అధికారులు తేల్చారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి వివరణ ఇస్తూ పంగిడిగూడెంలో వీఆర్వో చంద్రలీల పింఛన్ల సొమ్ము స్వాహా చేసినట్టు ఆరోపణలు వచ్చాయని, వెంటనే తాను విచారణ జరిపినట్టు తెలిపారు. అయితే సకాలంలోనే ఆమె లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

రోడ్లకు మోక్షం

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

సాక్షి స్పందన


భీమడోలు రాజుల వీధిలో గోతుల్లోని నీటిని డ్రైయిన్లలోకి మళ్లిస్తున్న సిబ్బంది


గుండుగొలను బీసీ కాలనీలో మురుగునీటిని డ్రైయిన్లలోకి మళ్లించిన తర్వాత రోడ్డు

భీమడోలు: చెరువులను తలపిస్తున్న రోడ్లు అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు, భీమడోలు రాజుల వీధిలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ఏర్పడిన గోతుల్లో నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ ఆదేశాల మేరకు ఈవోఆర్‌డీ కె.సుందరి పర్యవేక్షణలో భీమడోలు, గుండుగొలను గ్రామ కార్యదర్శులు వైయుఎం సూర్య, మురళీలు గోతుల్లోని మురుగునీటిని బయటకు పంపేందుకు తగు చర్యలు తీసుకున్నారు. అవసరమైన చోట్ల కచ్చా డ్రైయిన్లు తవ్వారు. భీమడోలు పంచాయతీ పరిధిలో రహదారుల్లో ఏర్పడిన భారీ గోతుల్లో నిలిచిన నీటిని పక్కనే ఉన్న డ్రైయిన్లలోకి పారిశుద్ధ్య సిబ్బంది మళ్లించారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారీ చేయాలని మండల అధికారులు సూచించారు. గుండుగొలను బీసీ కాలనీలోని సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు చేరి అధ్వానంగా ఉండడంతో పంచాయతీ సిబ్బంది రోడ్లు చుట్టూ కచ్చా డ్రైయిన్లు తీశారు. దీనితో అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దివ్యాంగులను ఆదరించాలి


గుండుగొలనులో దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్ఐ సుధాకర్‌లు

భీమడోలు: దివ్యాంగుల్లో అసాధారణ స్వాభావిక ప్రతిభ ఉంటుందని, వారంతా అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. గుండుగొలను విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఇటీవల జరిగిన పదో పరీక్షల్లో ప్రతిభను చాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల్లోని ప్రతిభను పెంపొందించుకోవడంతో పాటు వారి వికాసానికి వేదిక కావాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన దాత మంతెన సూర్యనారాయణరాజు ఆర్థిక సాయంతో 60 మంది దివ్యాంగులకు సన్నబియ్యం, పళ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన స్వర్గీయ దాట్ల సూరపరాజు జ్ఞాపకార్థం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభను చాటిన ముగ్గురికి నగదు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్, జిల్లా దివ్యాంగుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, పాఠశాల ప్రతినిధులు గేదెల సురేష్, నిర్వాహకులు దాట్ల కృష్ణంరాజు, సీతారామారాజు, పేరిచర్ల శ్యామలరాజు, గేదెల శ్రీనివాసరావు, ఏ.సోములు, రావి గంగరాజు, కర్రి గంగాధరరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలను నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ), హేలాపురి కళాపరిషత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయా కమిటీల సభ్యులు తెలిపారు. ఈ నాటిక పోటీల్లో ఆయా నాటక కళా సమాజాలచే ఏడు నాటికలు ప్రదర్శించబడతాయన్నారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం ప్రారంభ సభతో పోటీలు ప్రారంభమై కళానికేతన్, వీరన్నపాలెం వారిచే 'రాజుగారి గోచి' నాటిక రాత్రి 8 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారిచే అమృత హస్తం నాటిక ప్రదర్శిస్తారన్నారు. శుక్రవారం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారిచే 'రాత' నాటిక, కళావర్షిని ద్రోణాదుల వారిచే 'అజరామరం' నాటిక, శనివారం అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక, శ్రీ కృష్ణ ఆర్ట్స్ తెలుగు థియేటర్స్ గుడివాడ వారిచే 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటిక ప్రదర్శిస్తారన్నారు. ఉత్సవాల ముగింపు రోజైన ఆదివారం శ్రీ సాయి ఆర్ట్స్, కొలకలూరి వారిచే 'కౌసల్య సుప్రజా రామా' నాటిక ప్రదర్శిస్తారన్నారు. అదే రోజు విజేతలను ప్రకటించి బహుమతి ప్రదాన సభ నిర్వహిస్తామన్నారు. అలానే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రదర్శనలుగా వీ. రామాంజనేయులు గారితో మయసభ ఏకపాత్ర , పీ. విజయ్ కుమార్, బీ గంగారావు 'రామభక్త హనుమాన్' పద్య నాటకం, మండవ రాజగోపాలకృష్ణ 'శంబరాసూర' ఏకపాత్ర ప్రత్యేక ప్రదర్శనలుగా ఏర్పాటు చేశామన్నారు.

65 గోవులకు వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణశాలలోని గోవులకు మంగళ, బుధవారాల్లో వైద్య పరీక్షలను నిర్వహించారు. అందులో 65 ఆవులకు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ గర్భకోశ వ్యాధుల పరీక్షలు, చూడి నిర్ధారణ పరీక్షలను జరిపారు. అలాగే అన్ని ఆవులకు గొంతు వాపు వ్యాధి టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో గోసంరక్షణశాల ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ కిషోర్, గుమస్తాలు కోదండ రామాచార్యులు, రామకృష్ణ, రామిరెడ్డి తదితరులున్నారు.

నేడు మహిళా వేధింపుల నివారణ చట్టం అమలుపై సమావేశం

ఏలూరు (టూటౌన్): మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం అమలుపై గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేపీపీఎల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, నోడల్ అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆమె కోరారు.

ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన శ్రీశైల భక్తసేవా సమితి అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, పి.గోవర్ధన్, కేవీఎన్ గుప్తా వారసుల సహాయంతో నాలుగు వేల మంది భక్తులకు సరిపడా మందులను బుధవారం ఉచితంగా అందజేశారు. వీటిని శ్రీశైల భక్తసేవా సమితి మెడికల్ ఇన్‌చార్జి ఎం.పూర్ణచంద్రరావు, ఏవీ సాంబశివరావుల చేతులు మీదుగా చినవెంకన్న దేవస్థానం డీఈఓ బాబురావు, ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యుడు రాజేంద్రప్రసాద్‌లకు అందించారు. ఈ మందులను కాలినడక భక్తులకు వినియోగించాలని దాతలు కోరారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.